



నిలిచిన రోడ్డు విస్తరణ

అర్ధాంతరంగా నిలిచిపోయిన రోడ్డు నిర్మాణం

రెండువైపులా ఉన్న మట్టి రోడ్డుపై గుంతలు పడగా, డ్రైనేజీ నిర్మాణం అసంపూర్తిగా ఉంది.

ఇబ్బందులు పడుతున్న ప్రజలు

చొప్పదండి, జనవరి 31: పట్టణంలోని ప్రధాన రహదారిని విస్తరించేందుకు ఎన్నికలకు ముందు హడావుడిగా పనులు ప్రారంభించారు. మొదట్లో వేగంగా పనులు చేశారు. రోడ్డు మధ్యలో డివైడర్‌ను నిర్మించారు. రోడ్డు విస్తరణలో భాగంగా పలు ఇళ్లను కూల్చివేశారు. ఎన్నికలు ముగిశాయి. పనులు నిలిచిపోయాయి. డివైడర్ నిర్మాణంతో రోడ్డు ఇరుకుగా మారింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు ప్రమాదాలు జరుగుతున్నాయి.

● రెండేళ్ల క్రితం శంకుస్థాపన...

చొప్పదండి పట్టణలోని గుమ్లాపూర్ క్రాస్ రోడ్ నుంచి డి-86 కాలువ వరకు ప్రస్తుతం ఉన్న రోడ్డును 100 అడుగుల మేరకు వెడల్పు చేసి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసేందుకు 2022 ఫిబ్రవరిలో అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీ రామారావు శంకుస్థాపన చేశారు. 33 కోట్ల రూపాయలు మంజూరు చేసి కాంట్రాక్టర్‌కు పనులు అప్పజెప్పారు. రోడ్డుకు రెండువైపులా డ్రైనేజీ నిర్మాణం పూర్తికాగా విద్యుత్ టవర్లను ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి, రోడ్డు వెడల్పు చేయాల్సి ఉండగా అవేమి పట్టించుకోకుండా రోడ్డు మధ్యలో డివైడర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో రోడ్డు ఇరుకుగా మారింది. ప్రతినిత్యం వందలాది భారీ వాహనాలు వెళ్తున్న క్రమంలో రోడ్లను వెడల్పు చేసిన తర్వాత డివైడర్‌ను నిర్మిస్తే ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఉండేది.

● ఎన్నికల ముందు హడావుడిగా...

సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుతోపాటు రోడ్డు వెడల్పు పనులను అసెంబ్లీ ఎన్నికలకు ముందు హడావుడిగా ప్రారంభించారు. నిర్మాణం పూర్తయితే ఇలా ఉంటుందంటూ అధికారులు గ్రాఫిక్స్‌ను విడుదల చేశారు. ప్రారంభంలో పనుల్లో వేగం చూసి ప్రజలు కూడా రోడ్డు పనులు పూర్తవుతాయని భావించారు. ఎన్నికల తర్వాత ప్రభుత్వం మారగానే పనులు నిలిచిపోయాయి. తమకు బిల్లులు రావాల్సి ఉందంటూ కాంట్రాక్టర్ చెబుతున్నాడు. పనులు వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

● ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

కరీంనగర్ టౌన్, జనవరి 31: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తిచేసింది. జిల్లాలో 58 జనరల్, 16 వొకేషనల్, మొత్తం 74 పరీక్షా కేంద్రాల్లో ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహించనున్నారు. 108 ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులు ఈ ప్రాక్టికల్ పరీక్షలకు హాజరు కానున్నారు. బాటనీలో 2,264 మంది, జువాలజీలో 2,263, ఫిజిక్సులో 11,289, కెమిస్ట్రీలో 11,288, మొత్తం 27,104 మంది విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలకు హాజరవుతున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ ఇన్‌చార్జి విద్యాధికారి జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారు.



గురువారం నుంచి ప్రారంభమయ్యే ప్రాక్టికల్ పరీక్షలు ప్రతిరోజు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని చెప్పారు. ఫిబ్రవరి 15వ తేదీ వరకు మూడు విడతల్లో జరిగే ఈ ప్రాక్టికల్ పరీక్షలకు ఆయా కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలను కల్పించామని అన్నారు. ప్రాక్టికల్ పరీక్షలకు అవసరమయ్యే పరికరాలు, రసాయనాలు సిద్ధంగా ఉంచామని చెప్పారు. పరీక్షల నిర్వహణపై ఇప్పటికే కలెక్టర్ అధ్యక్షతన వివిధ విభాగాల అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి ఆయా శాఖల సహకారంతో పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు. ప్రాక్టికల్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశామని, ఈ కమిటీ నిరంతరం పర్యవేక్షిస్తుందని అన్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. విద్యార్థులు పరీక్షలకు హాల్ టికెట్లతో హాజరు కావాలని, హాల్ టికెట్లను సంబంధిత కళాశాలల నుంచి తీసుకోవాలని సూచించారు. కళాశాలల యాజమాన్యాలు హాల్ టికెట్లు ఇచ్చేందుకు విద్యార్థులను ఇబ్బంది పెట్టొద్దని, ఎక్కడైనా హాల్ టికెట్లు ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తే సంబంధిత కళాశాలలపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఐఈవో హెచ్చరించారు. విద్యార్థులు సకాలంలో పరీక్షలకు హాజరై ఎలాంటి ఒత్తిళ్లకు లోనుకాకుండా పరీక్షలు రాయాలని సూచించారు.

5న బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

● హాజరుకానున్న మాజీ మంత్రి హరీశ్‌రావు
● పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యం
● మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ టౌన్, జనవరి 31: భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కార్యకర్తల విస్తృతస్థాయి సమా వేశాన్ని ఈ నెల 5న కరీంనగర్‌లో ఏర్పాటు చేసినట్లు మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తెలిపారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా మాజీ మంత్రి టి హరీశ్‌రావు హాజరవుతారన్నారు. బుధవారం నగరంలోని ఆయన నివాసంలో బీఆర్ఎస్ ముఖ్యనా యకులతో సన్నాహక సమావేశాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే పార్ల మెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా ఈనెల 5న నగరంలోని కొండ సత్యలక్ష్మి గార్డెన్స్‌లో కరీంనగర్ అసెంబ్లీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా సమావే శాలను నిర్వహిస్తున్నామన్నారు. 5న జరిగే సమావేశానికి నాయ కులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, కరీంనగర్ రూరల్ ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య, నాయకులు రెడ్డవేణి మధు, పొన్నం అనిల్‌కుమార్, సాబీర్ పాషా, జమీలొద్దీన్, కాసారపు శ్రీనివాస్‌గౌడ్, పిట్టల రవీందర్, పిల్లి మహేశ్‌గౌడ్, సుంకిశాల సంపత్‌రావు, జువ్వాడి రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

జమ్మికుంటలో బీఆర్ఎస్‌కు షాక్

● పార్టీకి 13 మంది కౌన్సిలర్ల రాజీనామా
● అవిశ్వాసం నుంచి గట్టెక్కిన ఐదు రోజులకు ఊహించని పరిణామం



బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన 13మంది కౌన్సిలర్లు

జమ్మికుంట, జనవరి 31: జమ్మికుంటలో బీఆర్ఎస్ కు షాక్ తగిలింది. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 13 మంది కౌన్సిలర్లు సంచలన నిర్ణయం తీసుకు న్నారు. బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేస్తు న్నట్లు ప్రకటించారు. అవిశ్వాసం గట్టెక్కి ఐదు రోజులైనా గడ వక ముందె ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి ఎదురు దెబ్బ తగిలింది. బుధవారం హుజూరాబాద్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ సమక్షంలో పలు వాహనాల్లో గాంధీభవన్‌కు తరలి వెళ్లారు. అక్కడి నుండి బీఆరెస్ పార్టీకి రాజీనామ చేస్తున్నట్లు లిఖిత పూర్వ కంగా ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు గల కారణా లను ఓ వీడియో ద్వారా సోషల్ మీడియా లో పోస్ట్ చేశారు. మున్సి పల్ కార్యాల యంలో చైర్మన్ తక్కళ ఎల్లి రాజేశ్వర్‌రావు తన ఇష్టాను సారంగ వ్యవహరిస్తున్నారని మండి పడ్డారు. అవకతవకలకు పాల్పడుతూ వక్ర మార్గంలో అడ్డగోలు బిల్లులు విడు దల చేసుకున్నాడని విమర్శించారు. కొన్ని కారణాల వల్ల తాము చైర్మన్ రాజేశ్వర్‌రావుపై పెట్టిన అవిశ్వాసం ఈ నెల 25న వీగి పోయిందని, ఐదురోజులు గడుస్తున్నా చైర్మన్ వైఖరిలో మార్పు రాలేదన్నారు. తమను ఇబ్బంది లకు గురి చేయడం మొదలు పెట్టాడన్నా రు. చైర్మన్ ను కట్టడి చేసే సత్తా ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి లేదన్నారు. అందుకోసమే తాము బీఆరెస్‌కు మూకుమ్మడి రాజీనా మాలు చేసి, కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న ట్లు తెలి పారు.వారి వెంట సీనియర్ నాయ కులు పత్తి కృష్ణారెడ్డి, తుమ్మేటిసమ్మిరెడ్డి, పొనగంటి మల్లయ్య ఉన్నారు.

విప్ జారీ చేయడం వల్లే కౌన్సిలర్ల ఆగ్రహం

సొంత పార్టీ కౌన్సిల్ సభ్యులు చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టడాన్ని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి సీరియస్‌గా తీసుకున్నారు. అవిశ్వాస సమావేశంలో పొనగంటి మల్లయ్యకు మద్దతు ఇవ్వకుండా ఉండటం కోసం తమ పార్టీ కౌన్సిలర్లకు విప్ జారీ చేశారు. విప్ కాపీలను కలెక్టర్‌కు 24న అందజేయడంతో కౌన్సిలర్లు కొంత అసహనానికి లోనయ్యారు. దీనికితోడు చైర్మన్ ఇష్టానుసారం వ్యవహరిస్తున్నాడని, మరింత ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తున్నారనే ఉద్దేశంతోనే పార్టీ వీడినట్లు తెలిపారు.

సీపీఎం ప్లీనరీని విజయవంతం చేయాలి

భగత్‌నగర్, జనవరి 31: జిల్లా కేంద్రంలో ఫిబ్రవరి 27, 28, 29 తేదీల్లో నిర్వహించే సీపీఎం జిల్లా ప్లీనరీ సమావేశాలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. బుధవారం నగరంలోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో వర్ణ వెంకట్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని కోరారు. సమావేశంలో గుడికందుల సత్యం, జి భీమాసాహెబ్, యు శ్రీనివాస్, సుంకరి సంపత్, శీలం అశోక్, డి నరేష్‌పటేల్ కాల్వ సురేష్, జి అశోక్ పాల్గొన్నారు.

ఆపరేషన్ స్మైల్-ఎక్స్ విజయవంతం

- జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ ధనలక్ష్మి

గణేశ్‌నగర్, జనవరి 31: జిల్లాలో నిర్వహించిన ఆపరేషన్ స్మైల్-ఎక్స్ కార్యక్రమం విజయవంతమైందని జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్పర్సన్ ధనలక్ష్మి అన్నారు. బుధవారం జిల్లా కార్యలయంలో నిర్వహించిన సమా వేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర మహిళాశిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సమగ్ర బాలల పరిరక్షణ పథకం చేపట్టామన్నారు. చైల్డ్ లైన్ 1098, పోలీస్, లేబర్, రెవెన్యూ, విద్యా శాఖల సహకారంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ బృందాలు నెల రోజులపాటు జిల్లా విస్తృతంగా తనిఖీలను నిర్వహించి 19 మంది పిల్లలను రెస్క్యూ చేశారన్నారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ వారు ఈ పిల్లలకు కౌన్సెలింగ్ నిర్వహించామన్నారు. పిల్లలను వారి స్వస్థలాలకు పంపించామని తెలిపారు. ఆపరేషన్ స్మైల్ ఎక్స్‌ను విజయవంతం చేసిన అధికారులు, సిబ్బం దిని ఆమె అభినందిచారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రేండ్ల కళింగ శేఖర్, విజయ్‌కుమార్, రాధ, అర్చనరెడ్డి పాల్గొన్నారు.

రెండు లక్షల ఉద్యోగఖాళీల వివరాలు వెల్లడించాలి

● అబద్ధాల హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్
● మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్



సమవేశంలో మాట్లాడుతున్న వినోద్ కుమార్

కరీంనగర్ టౌన్, జనవరి 31: కాంగ్రెస్ ప్రభుత్వ అధికారంలోకి రాగానే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి, కోదండరామ్ చెప్పారని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేసేందుకు ఏఏ ప్రభుత్వ శాఖల్లో ఎన్ని ఖాళీలు ఉన్నాయనే వివరాలను స్పష్టం చేయా లని ఆయన డిమాండ్ చేశారు. బుధవారం నగరంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు అబద్ధపు హామీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని అన్నారు. ప్రభుత్వ ఖాళీల భర్తీకి సంబంధించి వెంటనే వివరాలతో కూడిన జీవోను విడుదల చేయించాలని అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ సర్కారు 1,60,083 ఉద్యోగాలను భర్తీ చేయడంతో పాటు 42,652 ఉద్యోగాలకు పరీక్షలు నిర్వహించిందని అన్నారు. మరో 32 వేల ఉద్యోగాలను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్లను కూడా ఇచ్చేందుకు సన్నద్ధమైందని తెలిపారు. 2024 డిసెంబరు 24వరకు రెండు లక్షల ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏడు వేల స్టాఫ్‌నర్స్ పోస్టులకు పరీక్షలు నిర్వహిస్తే ప్రస్తుత రేవంత్‌రెడ్డి సర్కారు తామే ఈ ఉద్యోగాలను ఇచ్చినట్లు ప్రచారం చేసుకుంటుందని విమర్శిం చారు. తాను కరీంనగర్ గడ్డపైనే పుట్టి పెరిగానని, తనపై బండి సంజయ్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని వినోద్ కుమార్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి గాలిమాటలు కాకుండా ఇచ్చిన హామీలను అమలు చేయడంపై దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, బీఆర్ఎస్ నాయకులు సిద్ధం వేణు, ఎల్ రూప్‌సింగ్, దిలీప్, జక్కుల నాగరాజుయాదవ్, దూలం సంపత్‌గౌడ్, ద్యావ మధుసూదన్ రెడ్డి, సత్యం యాదవ్, తిరుపతినాయక్ పాల్గొన్నారు.

రేపు కరీంనగర్‌లో గిరిజన ఆత్మీయ సమ్మేళనం

కరీంనగర్ టౌన్, జనవరి 31: బీఆర్ఎస్ ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ రూప్‌సింగ్ ఆధ్వర్యంలో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని గిరిజన ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు తెలిపారు. పార్టీ పార్లమెంట్ కార్యాలయంలో సన్నాహక సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీ రామకృష్ణారావు మాట్లాడుతూ చింతకుంటలోని ఎస్వీఆర్ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ మంత్రి గంగుల కమలాకర్, బీఆర్ఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య హాజరవుతున్నారని తెలిపారు. సమ్మేళనానికి ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, ముఖ్యకార్యకర్తలందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు రూప్‌సింగ్, తిరుపతినాయక్, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి

జమ్మికుంట రూరల్, జనవరి 31: పెండింగ్‌లో ఉన్న స్కాలరిషిప్‌లు, రీ యింబర్స్ మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామరపు వెంకటేష్ అన్నారు. బుధ వారం పట్టణంలో ఏర్పాటు చేసి న సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన నూతన జాతీయ విద్యా విధానం ప్రభుత్వ విద్యా వ్యవస్థను నాశనం చేసే విధంగా ఉందన్నారు. కార్పొరేట్ విద్యను బలోపేతం చేసి, కాషాయీకరణ చేయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని విమర్శించారు. కార్య క్రమం లో ఏఐఎస్ఎఫ్ నాయపకులు కేశబోయిన రా ము, హరీష్, శంకర్, కుమార్, వంశీ పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యా వ్యవస్థ నిర్వీర్యం అవుతోంది

● సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుతో పేద విద్యార్థులకు అన్యాయం
● ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ



సమావేశంలో మాట్లాడుతున్న ఝాన్సీ

సుభాష్‌నగర్, జనవరి 31: ప్రభుత్వ విద్యా వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అయ్యిందని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ అన్నారు. బుధవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ యూనివర్సిటీలో ఉన్న రెగ్యులర్ కోర్సులను సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులుగా మార్చి పేద బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేస్తున్నారని విమర్శించారు. ఇందుకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. యూనివర్సిటీ భూములు అన్యాక్రాంతం అవుతున్నా అధికారులు స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. ఎల్ఎండీ సమీపంలో ఉన్న ఫార్మసీ కళాశాల భూమలు కబ్జాకు గురువుతున్నాయని ఏబీవీపీ కార్యకర్తలు ధర్నా నిర్వహిస్తే అక్రమ కేసులు బనాయించారన్నారు. యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నా అధికారులు స్పందించకపోవడం బాదాకరమన్నారు. బీసీ సంక్షేమ వసతి గృహాలకు పక్కా భవనం లేక విద్యార్థులు అద్దె భవనాల్లో ఉంటూ చదువుకోలేకపోతున్నారని వాపోయారు. ఈ పరిస్థితి రాష్ట్ర వ్యాప్తంగా ఉందన్నారు. ప్రభుత్వాలు మారినా విద్యాసంస్థల భూముల కబ్జాలు ఆగలేదన్నారు. యూనివర్సిటీకి చెందిన భూములను వివిధ సంస్థలకు కేటాయిస్తూ ప్రభుత్వం జారీ చేసిన 55 జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత ప్రభుత్వం విద్యా వ్యవస్థ గురించి మాట్లాడకపోవడం బాదాకరమన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీ యింబర్స్‌మెంట్ రూ. 5,300 కోట్లు విడుదల చేయకపోవడం వల్ల పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీకి సంబంధించిన వంద ఎకరాల భూమిని హైకోర్టుకు కేటాయిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవోను వెంటనే వెనక్కి తీసుకోవాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్యాల రాకేశ్, జిల్లా కన్వీనర్ పుప్పాల విష్ణు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బైల్లపెల్లి అంజన్న, స్టేట్ లా ఫోరం కో కన్వీనర్ నక్క ప్రమోద్, నగర కార్యదర్శి భామండ్ల నందు పాల్గొన్నారు.

ఆర్సీవో, ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి

భగత్‌నగర్, జనవరి 31: విద్యార్థి మృతికి కారణమైన గురుకుల పాఠశాల ఆర్సీవో, ప్రిన్సి పాల్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని కోరుతూ పీడీఎస్‌యూ నాయకులు జిల్లా రెవెన్యూ అధికారి పవన్‌కుమార్‌కు బుధవారం వినతిపత్రం అందిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చింతకుంట గురుకుల పాఠశాలలో అక్షిత అధ్యా పకుల ఒత్తిడితోనే ఆత్మహత్య చేసుకుందన్నారు. ఈ ఘటనపై విచారణ చేపట్టి బాధ్యులను సస్పెండ్ చేయాలన్నారు. విద్యార్థిని తల్లిదం డ్రులకు 50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.కార్యక్ర మంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు మచ్చ రమేష్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి బ్రామండ్లపల్లి యుగేంధర్, నాయకలు మురళి,రాకేష్,హేమంత్, సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.



డీఆఆర్ఓకు వినతి పత్రం అందిస్తున్న పిడిఎస్‌యు నాయకులు

చికిత్స పొందుతూ ఒకరి మృతి

వేములవాడ టౌన్, జనవరి 31: మద్యం మత్తులో గడ్డి మందుతాగి ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి చెందిన సంఘటన వేములవాడ మండలం అనుపురం గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన మేర్గు శ్రీనివాస్ (26) అనే వ్యక్తి మద్యం మత్తులో ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగాడు. దీంతో గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు ఎల్లారెడ్డిపేట మండలంలోని ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు మృతుడి భార్య శ్రీలత పోలీసులకు ఫిర్యాదు చేసింది.



జి సాయిప్రియ

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు డిగ్రీ విద్యార్థిని

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 31: హైదరాబాద్‌లోని బాచుపల్లిలో ఈ నెల 1 నుంచి 4వ తేదీ వరకు జరిగే 49వ జాతీయ స్థాయి జూనియర్ కబడ్డీ పోటీలకు జిల్లా కేంద్రంలోని మహిళా డిగ్రీ కళాశాల క్రీడాకారిణి జి సాయిప్రియ ఎంపికైంది. గత నెల 11వ తేదీ నుంచి 14వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో అత్యంత ప్రతిభ చాటి కరీంనగర్ జట్టుకు 3వ స్థానాన్ని అందించడంలో కీలకపాత్ర పోషించిన ఆమె జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ జి శ్రీధర్ రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆమెను కళాశాల ప్రిన్సిపల్, ప్రొఫెసర్ టి. శ్రీలక్ష్మి, అధ్యాపక బృందం అభినందించారు.

జాతీయ స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు ఎంపిక

తిమ్మాపూర్, జనవరి31: మండలంలోని మొగిళిపాలెం జిల్లా ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని అపూర్వ ఫిబ్రవరి 2 నుంచి 6వరకు చత్తీఘడ్ రాష్ట్రం, ఖాటీర్ దాంలో జరగనున్న జాతీయ స్థాయి పాఠశాలల క్రీడల ఆధ్వర్యంలో జరగనున్న సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీఈటీ ఆడెపు శ్రీనివాస్ తెలిపారు. జనవరి 16 నుంచి 18 వరకు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో జరిగిన 67వ పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ 14 సంవత్సరాల విభాగం పోటీల్లో కరీంనగర్ జిల్లాకు అపూర్వ, సాయి శరణ్యలు ప్రాతినిధ్యం వహించారు. ఈ పోటీల్లో మూడవ స్థానంలో గెలుపొందగా అందులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అపూర్వను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. అపూర్వను పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహారెడ్డి, పిఈటి అడేపు శ్రీనివాస్ , ఉపాధ్యాయులు ఈశ్వర్, వివేక్, విద్యా సాగర్, దేవేందర్, లక్ష్మి, తిరుమల, గ్రామ సర్పంచ్ సుస్మితరెడ్డి, ఎంపిటిసి తిలక్ ప్రియారెడ్డి అభినందించారు.

సైబర్ మోసంతో డబ్బులు మాయం

వీణవంక జనవరి31: మండలంలోని దేశాయిపల్లి గ్రామానికి చెందిన పురంశెట్టి వెంకటేష్ మొబైల్ ఫోన్‌కు గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఫోన్ వచ్చింది. బిట్‌కాయిన్‌తో ఎంత డబ్బులు పెడితే అంతకు రెట్టింపు డబ్బులు వస్తాయని తప్పుడు సంకేతాలు ఇచ్చి 6,42,040 రూపాయలు కాజేశారని అనంతరం ఎలాంటి స్పందన లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.గుర్తు తెలియని వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ప్రజలు మొబైల్ ఫోన్‌కు వచ్చే అనవసరపు లింకులు ఓపెన్ చేయవద్దని సైబర్ మోసగాళ్ల ఉచ్చులో పడి ఆర్థికంగా మోసపోవద్దని తెలిపారు.

డైట్‌లో పద్య రచన కార్యశాల

తిమ్మాపూర్, జనవరి31: మండలంలోని ఎల్‌ఎండీ కాలనీలో గల జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్)లో బుధవారం పద్య రచన కార్యశాల నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తగా ప్రముఖ కవి, అవధాని, సాహితీ రత్న డాక్టర్ గంప్ర లక్ష్మణరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పద్యం సాంస్కృతిక వారసత్వాన్ని, జాతి జీవనాన్ని భావితరాలకు అందిస్తుందన్నారు. పద్యం బ్రహ్మ పదార్థం కాదని, పద్యం రాయడం చాలా తేలిక అని తెలిపారు. పద్యం లయను, నాడిని, నడకను పట్టుకుంటే పద్య రచన చాలా తేలిక అని అన్నారు. పద్యంలో చందోనియమాలు ఉన్నప్పటికీ ఆ చందస్సు నియమమే పద్య రచనలను చాలా హృద్యంగంగా, రసనైకవేద్యంగా మలు స్తుందన్నారు. పద్య లక్షణాలను గణాలను, యతిప్రాసలను వివరిస్తూ ఏఏ సందర్భాల్లో ప్రాస నియమం పాటించబడుతుందో సవివరంగా వివరించారు. ఈ సందర్భంగా డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య మాట్లాడుతూ జిల్లా విద్యా శిక్షణ సంస్థ కేవలం పెడగాగికి సంబంధించిన అంశాలే కాకుండా ఛాత్రోపాధ్యాయుల పరిపూర్ణ మూర్తిమత్వ వికాసానికి దోహదపడే విధంగా వినూత్న కార్యక్రమాలను రూపొందిస్తున్నట్లు తెలిపారు. దానిలో భాగంగానే పద్య రచనపై కార్యశాల నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యశాలను ఉపయోగించుకొని భవిష్యత్తులో విద్యార్థులు మంచి పద్య కవులుగా ఎదగాలని ఆశిస్తున్నామన్నారు. విభిన్న అంశాలపై విద్యార్థులు దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఛాత్రోపాధ్యాయులు కె.శంకర్, చెరుకు ప్రద్యుమ్న కుమార్, మహేశ్వర్‌రెడ్డి, గాజుల రవీందర్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

రాజన్న ఆలయాభివృద్ధిపై సీఎం సమీక్ష

● రూ.20 కోట్ల నిధుల విడుదలకు ఆదేశం ● రోడ్డు విస్తరణ, బ్రిడ్జి నిర్మాణానికి త్వరలో రూ.35 కోట్ల నిధులు

సిరిసిల్ల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధికి గతంలో హెచ్‌ఎండీఏ సాఫ్ట్ లోన్ ద్వారా మంజూరై నిలిచిన రూ.20 కోట్ల నిధులను విడుదల చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. బుధవారం హైదరాబాద్‌లో వేములవాడ టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆలయంలో జరుగుతున్న పనులపై పవర్ ప్రజంటేషన్ ద్వారా వీటీడీఏ వైస్ ఛైర్మన్ అనురాగ్ జయంతి ముఖ్యమంత్రికి వివరించారు. దేవస్థానం అభివృద్ధి, బద్దిపోచమ్మ ఆలయ అభివృద్ధి నమూనాలను, పార్కింగ్ స్థలంలో టూరిజం శాఖ చేపడుతున్న పనులను వివరించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ నిలిచిపోయిన నిధులు రూ 20 కోట్లను విడుదల చేయాలని ఆదేశిస్తూ బద్దిపోచమ్మ ఆలయ అభివృద్ధి, శివార్చన మండప నిర్మాణం, గుడిచెరువు సుందరీకరణ, నటరాజ విగ్రహం ఏర్పాటుతోపాటు పార్కు నిర్మాణ పనుల్లో వేగం పెంచాలన్నారు. బద్దిపోచమ్మ ఆలయ అభివృద్ధితోపాటు టూరిజం శాఖ పనుల్లో వేగం పెరగాలన్నారు. వేములవాడ పట్టణ ప్రజలతో పాటు రాజన్న భక్తులకు ట్రాఫిక్ కష్టాలు తీర్చేలా మూలవాగు బ్రిడ్జితో పాటు బ్రిడ్జి నుంచి 800 మీటర్ల వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని సూచించారు. రోడ్ల విస్తరణతోపాటు మూలవాగు బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన రూ.35 కోట్లు నిధులు త్వరలో విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. గుడిచెరువులోకి వివిధ కాలువల ద్వారా మురికి నీరు చేరకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. నూతన కాలువల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. మురుగు కాలువల నిర్మాణానికి ఎస్డీఎఫ్ నిధుల విడుదల చేయాలని, మురుగు నీటిని ట్రీట్‌మెంట్ ప్లాంట్ ద్వారా శుద్ధి చేయాలని అన్నారు. గుడిచెరువు విస్తీర్ణం, పార్కింగ్ స్థలాల వివరాలను సీఎం తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి శేషాద్రి, హెచ్‌ఎండీఏ కమిషనర్ దానకిషోర్, కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ గౌతమి, దేవాదాయ కమిషనర్ అనిల్‌కుమార్, వేములవాడ దేవస్థానం ఈవో కృష్ణప్రసాద్, వేములవాడ కమిషనర్ అవినాష్ పాల్గొన్నారు.


ముఖ్యమంత్రికి రాజన్న ప్రసాదం అందజేస్తున్న ఆది శ్రీనివాస్

ముఖ్యమంత్రికి రాజన్న ప్రసాదం

హైదరాబాద్‌లో వేములవాడ టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ సమీక్ష సమావేశం సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, రాజరాజేశ్వరస్వామి ప్రసాదాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందజేశారు. మురికి నీటి కాలువల నిర్మాణానికి ఎస్డీఎఫ్ నిధులు మంజూరు చేసి వీటీడీఏ సమావేశాన్ని నిర్వహించిన ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

బియ్యం షాపులపై తూనికలు కొలతల శాఖ దాడులు

● ఐదు కేసులు నమోదు

కరీంనగర్ క్రైం, జనవరి 31: నగరంలోని బియ్యం షాపులపై తూనికలు కొలతల శాఖ అధికారులు బుధవారం దాడులు నిర్వహిచి ఐదు కేసులు నమోదు చేశారు. నగరంలోని గంజ్ ప్రాంతంలో వినియోగదారుల ఫిర్యాదు మేరకు శ్రీమాతారైస్‌డిపో, సాయిసరస్వతి కిరాణం, ఉప్పల క్రిష్ణమూర్తి కిరాణ షాపులపై దాడులు చేసి ఐదు కేసులు నమోదు చేసి, 230 రైస్ బ్యాగులు సీజ్‌చేశారు. ఈ దాడుల్లో లీగల్ మెట్రాలజి కరీంనగర్ జోన్ ఎసి కె విజయసారథి, కరీంనగర్ జిల్లా ఇన్స్‌పెక్టర్ భూలక్ష్మి, ఇన్స్‌పెక్టర్ డి రూపేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వరిలో జింకు లోపాన్ని గుర్తించాలి

గంగాధర, జనవరి 31: వరిలో జింకు లోపం నివారణకు పొలాలు ఎర్రబడకుండా ఉండేందుకు జింకు వేయాలని జమ్మికుంట కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండలంలోని కాసారం, పోతుగంటిపల్లి, గోపాల్‌రావుపల్లి గ్రామాల్లో వరిపొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి వేసుకున్న రైతులు తప్పకుండా మెలుకువలు పాటించాలని, ఎప్పటికప్పుడు పంట ఏ రకంగా పెరుగుతుందో పరిశీలించాలన్నారు. ఇటుక రంగుతో పైరు ఎర్రబారిన వెంటనే జింక్ వేసుకోవాలని జింక్ వేయకుండా నిర్లక్ష్యం చేస్తే పంటలు పాడవుతాయన్నారు. ప్రస్తుతం పొలాల్లో జింక్‌లోపం, కాండం తొలుచుపురుగు, సల్ఫైడ్ ప్రభావం కనిపిస్తుందన్నారు. నివారణకు తగిన మందులు వాడాలని రైతులకు సూచించారు. ఆయన వెంట ఏవో రాజు, ఆయా గ్రామాల రైతులు, ఏఈవోలు పాల్గొన్నారు.

అంజన్న భూములపై డిజిటల్ సర్వే


సర్వే నిర్వహిస్తున్న అధికారులు

మల్యాల, జనవరి 31: దిగువ కొండగట్టులో గల ఆంజనేయస్వామి దేవస్థానం భూములను అధికారులు బుధవారం డిజిటల్ సర్వే చేశారు. సర్వే నంబర్ 380సిలో దేవస్థానానికి 1.30ఎకరాల భూమి ఉండగా అందులో ఇటీవల అక్రమ నిర్మాణం జరుగుతుందని పలువురు ఫిర్యాదు చేయడంతో సర్వే చేపట్టారు. పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, సునీల్, ఏఈ లక్ష్మణ్‌రావు, సుధాకర్‌రెడ్డి తదితరులు సర్వే సిబ్బందితో దేవస్థానం భూమిని, నిర్మాణాన్ని పరిశీలించారు.

ధర్మపురిలో బీసీ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్ పూజలు

ధర్మపురి, జనవరి 31: ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని బీసీ వెల్ఫేర్ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ చంద్రశేఖర్ దంపతులు బుధవారం సందర్శించారు. ఆలయం సంప్రదాయం ప్రకారం అర్చకులు, సిబ్బంది వారికి మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, అర్చకులు వారిని ఘనంగా ఆశీర్వదించారు. ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్ వారికి స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం బహూకరించి సత్కరించారు. అలాగే వారు అనుబంధ ఆలయాలను, అద్దాల మండపాన్ని కూడా సందర్శించారు. అంతకు ముందు యమ ధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. వారి వెంట బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి సాయిబాబా, బీసీ హాస్టల్ వార్డెన్స్ జిల్లా అధ్యక్షుడు వెంకటరెడ్డి, హాస్టల్ వార్డెన్స్ సుధాకర్, నివేదిత, ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న చంద్రశేఖర్ దంపతులు

త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవాలు


వేములవాడలో నృత్య ప్రదర్శన

వేములవాడ, జనవరి 31 : వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న త్యాగరాజ స్వామి వారి ఆరాధనోత్సవాలలో రెండో రోజు బుధవారం నిర్వహించిన పలు సంగీత నృత్య కార్యక్రమాలు కళాభిమానులను ఆకట్టుకున్నాయి. ఉదయం శిఖామణి భాగవతారిణి హరికథా గానం చేయగా మధ్యాహ్నం జయకృష్ణ భాగవతార్ హరికథ వినిపించారు. సాయంత్రం కె. నరహరి శర్మ, హెచ్. సతీష్, ఆర్. హరికృష్ణ సంగీత కచేరితో సంగీతాభిమానులను అలరించారు. అనంతరం డివి మోహన కృష్ణ శాస్త్రీయ సంగీత కచేరి చేసి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. అనంతరం ఎన్. సతీందర్, ఆర్. విజయశ్రీ, శ్రీదేవి, వి. శరణ్య, అశ్విని బృందం నిర్వహించిన సంగీత కచేరి ఆకట్టుకుంది. రాత్రి శ్రీత్రైలోక్య ఆర్ట్ క్రియేషన్స్ బృందం వారు నిర్వహించిన నృత్య ప్రదర్శన ప్రేక్షకులను రంజింపజేసింది.

గట్టుసింగారంలో వెలుగులోకి రాతి చిత్రాలు



రాతి చిత్రాలతో ఉన్న గుహను చూపిస్తున్న కొత్త తెలంగాణ చరిత్ర బృందం

పంజాగుట్ట,జనవరి31(ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా గట్టుసింగారం గ్రామంలోని సీతమ్మ లొద్దిలో పాము పడగలా ఉన్న అతి పెద్ద రాతి గుహ, అద్భుతమైన రాతి చిత్రాల సంపద వెలుగులోకి వచ్చింది. ఆరున్నర కోట్ల సంవత్సరాల క్రితం ఏర్పడ్డ నత్తగుల్ల శిలాజం, లక్ష సంవత్సరాల క్రితం నాటి రాతి గొడ్డలి, సూక్ష్మ రాతి పనిముట్లు, తొలి చారిత్రక యుగానికి చెందిన ఆరు శాసనాలు, చిత్రాలు వెలుగు చూశాయి. కొత్త తెలంగాణ చరిత్ర బృందం గౌరవ సలహాదారుడు, ఫొటో జర్నలిస్ట్ డి.రవీందర్ రెడ్డి దీనిని వెలుగులోకి తెచ్చారు. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. రామగిరి ఖిల్లా వెనకాల అడవిలో సీతమ్మలొద్దిలో గుహ ఉన్నట్లు స్థానికులు చెప్పడంతో బృం దంతో కలిసి వెళ్లినట్లు తెలిపారు. ఈ రాతి చిత్రాలలో మధ్యరాతి యుగం(12 వేల సంవత్సరాల నుంచి), తొలి చారిత్రక యుగం(క్రీస్తు శకం 1 నుంచి 6వ శతాబ్దం వరకు)వేసినవి, ఎక్కువగా ఎరుపు రంగులో, కొన్ని చోట్ల తెలుపు, పసుపు రంగులలో వేసిన పురాతన రాతి చిత్రాలు ఉన్నాయన్నారు. ఇలాంటి రాతి చిత్రాలు గతంలో ఎక్కడా లభించలేదని తెలిపారు. స్త్రీ, పురుషులు ప్రత్యేకమైన ఆహార్యంతో, పాదరక్షలు ధరించి ఒక పంక్తిలో, గుండ్రంగా చేతులు పట్టుకుని సామూహికంగా నృత్యాలు చేస్తున్న దృశ్యాలు ఉన్నాయని, జంతువుల చిత్రాలలో జింకలు, తాబేళ్లు, అడవి పిల్లి, కోతులు, అడవి బల్లుల బొమ్మలు, మనుషుల చిన్న, పెద్ద పాద ముద్రికలు ఉన్నాయన్నారు. బృందం ఆధ్వర్యంలో తెలంగాణ చరిత్రను అన్వేషిస్తున్నామని, దానిని భావితరాలకు అందిస్తామన్నారు. తెలంగాణలో ఎంతో చరిత్ర ఉందన్నారు. పరిశోధనలతో చరిత్రను వెలుగులోకి తెస్తామన్నారు. రాతి చిత్ర నిపుణుడు, న్యూమిస్మాటిస్ట్ డాక్టర్ బండి మురళీధర్ రెడ్డి, సంస్థ కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్, కో కన్వీనర్ గిరీష్, చరిత్రకారుడు ఈమని శివనాగిరెడ్డి, ఆర్కియాలజిస్ట్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

మహిళ హత్య కేసులో జీవిత ఖైదు

కరీంనగర్ లీగల్, జనవరి 31: సహజీవనం చేస్తున్న మహిళను కర్రతో కొట్టి ఆమె చావుకు కారకుడైన వ్యక్తికి జీవిత ఖైదుతో పాటు 5వేల రూపాయల జరిమానా విధిస్తూ కరీంనగర్ ప్రత్యేక ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి లక్ష్మికుమారి బుధవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం మధ్యప్రదేశ్ రాష్ట్రం బక్కర్ గ్రామానికి చెందిన మహిళ రామ్ కాళీ (26)కి పెళ్లయి ఇద్దరు సంతానం ఉన్నారు. అదే గ్రామానికి చెందిన టిక్కం శ్యామ్‌రాజ్ (29)తో ఆమె అక్రమ సంబంధం కారణంగా రామ్‌కాళీ భర్త ఆమెతో విడాకులు తీసుకున్నాడు. తన ఇద్దరు పిల్లల్ని తల్లి దగ్గర వదిలి రామ్ కాళీ బతుకుదెరువు కోసం శ్యామ్‌రాజ్‌తో కలిసి కరీంనగర్‌కు వచ్చి అల్గునూర్‌లో అద్దె ఇంట్లో నివాసముంటూ కూలీపనికి వెళ్తున్నారు. 2022 నవంబర్ 1న మేస్త్రీ శ్యామ్‌రాజ్‌కు కూలి డబ్బులు ఇవ్వగా అవి నాకు ఇవ్వాలని వాటిని తల్లి పిల్లల పోషణకు పంపించాలని శ్యామ్‌రాజ్‌తో గొడవ పడింది. కొద్ది డబ్బులు తన దగ్గర ఉంచుకొని మిగతా డబ్బులను శ్యామ్ రాజ్ ఆమెకిచ్చినా వినకుండా మొత్తం డబ్బులు కావాలని ఆమె అడుగడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీనితో శ్యామ్‌రాజ్ అక్కడే ఉన్న కర్రతో రామ్ కాళిని తలపై కొట్టగా తీవ్ర గాయాలతో ఆమె చనిపోయింది. ఈ సంఘటనపై ఎల్‌ఎండి ఎస్‌ఐ ప్రమోద్‌రెడ్డి శ్యాంరాజుపై హత్యానేరం నమోదు చేయగా సీఐ శశిధర్‌రెడ్డి దర్యాప్తు చేశారు. ఈ కేసులో సాక్షులను అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జూలూరు శ్రీరాములు కోర్టులో ప్రవేశపెట్టి విచారించారు. సాక్షాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి శ్యామ్‌రాజ్‌కు జీవిత ఖైదుతోపాటు 5వేల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

కోరుట్ల, జనవరి31: పట్టణంలోని అర్బన్ కాలనీకి చెందిన ఇల్లెందుల గంగాధర్ (45) అనే వ్యక్తి ఆర్థిక ఇబ్బందులతో ఉరివేసుకొని బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మెట్‌పల్లి మండలం కోనరావుపేట గ్రామానికి చెందిన గంగాధర్ పట్టణంలోని అర్బన్ కాలనీలో భార్యాపిల్లలతో నివాసం ఉంటూ కుల వృత్తి అవుసుల పని చేస్తున్నాడు. కొన్ని రోజుల నుంచి గంగాధర్ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటూ తరచుగా బాధపడేవాడు. బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. గంగాధర్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కిరణ్‌కుమార్ తెలిపారు.

ఓయూలో విద్యార్థి ఆత్మహత్య


ఎర్ర నవీన్(ఫైల్)

తార్నాక, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో పురుగుల మందు తాగి ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఓయూ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా కోరుట్ల ప్రాంతానికి చెందిన ఎర్ర నవీన్ (23) ఓయూలో ఎం.కామ్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల క్రెడిట్ కార్డుల ద్వారా అప్పులు చేసి బిట్ కాయిన్‌లో డబ్బులు పోగొట్టుకున్నాడు. దీంతో గత కొద్ది రోజులుగా తీవ్ర మనస్తాపం చెందిన నవీన్ ఓయూలోని మంజీరా హాస్టల్‌లో మంగళవారం అర్ధరాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. తోటి విద్యార్థులు నవీన్‌ను హుటాహుటిన గాంధీ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మరణించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఓయూ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భూ పంచాయతీ విషయమై రైతు ఆత్మహత్యాయత్నం

కాల్వశ్రీరాంపూర్, జనవరి 31: ఐదేళ్లుగా భూపంచాయతీని పెద్దమనుషులు సాగదీస్తుండడంతో జీవితం మీద విరక్తి చెందిన మండలంలోని జాఫర్‌ఖాన్‌పేటకు చెందిన రైతు బొజ్జం శివకృష్ణ బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. అంతకు ముందు ఆత్మహత్య చేసుకుంటున్నానని సోషల్ మీడియాలో వీడియో పోస్టు చేయగా వైరల్‌గా మారింది. గ్రామానికి చెందిన పెద్ద మనుషులు పంచాయతీని సాగదీస్తూ తనను ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ శివకృష్ణ పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. బాధితుడిని పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

హుజూరాబాద్‌రూరల్, జనవరి 31: మండలంలోని తుమ్మనపల్లి గ్రామ శివారులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ నుంచి చంద్రాపూర్ వైపు వెళ్తున్న బోలోరో వాహనం తుమ్మన్నపల్లి గ్రామ శివారులో అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో వాహనం నడుపుతు న్న గురుదాస్‌సింగ్‌దార్(53) అక్కడికక్కడే మృతి చెందగా, క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించారు. మృతదేహాన్ని, క్షతగాత్రుడిని హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కొనసాగుతున్న జేఈఈ మెయిన్స్

తిమ్మాపూర్, జనవరి31: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బుధవారం ఏర్పాటు చేసిన రెండు పరీక్ష కేంద్రాలలో తొలివిడత జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామ్స్ (జేఈఈ మెయిన్) పేపర్-1 పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. మండలం కేంద్రంలోని ఐయాన్ డిజిటల్ జోన్, శ్రీ చైతన్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ రెండు పరీక్ష కేంద్రాలలో రెండు సెషన్‌లలో పరీక్ష నిర్వహించారు. ఉదయం 9 నుంచి 12గంటల వరకు జరిగిన మొదటి సెషన్‌లో రెండు పరీక్ష కేంద్రాలలో కలిపి 880మందికి 862 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 18మంది గైర్హాజరైయ్యారు. మధ్యాహ్నం 3నుంచి 6గంటల జరిగిన రెండవ సెషన్‌లో 817 మందికి 760మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 57మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నట్లు ఎన్‌టిఏ సీటీ కో ఆర్డినేటర్ లలిత కుమారి తెలిపారు.

దూదేకుల ఫెడరేషన్‌కు నిధులు కేటాయించాలి



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నూర్‌బాషా సంఘం నాయకులు

సుభాష్‌నగర్, జనవరి 31: నూర్‌బాషా దూదేకుల ఫెడరేషన్‌కు నిధులు కేటాయించాలని నూర్ భాష దూదేకుల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, భట్టి విక్రమార్కతో పాటు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, ప్రొఫెసర్ కోదండ రామ్‌లను కలిసి వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎండి అజీమొద్దీన్, వసీం, రజాక్, అహ్మద్‌హుస్సేన్, నసీరొద్దీన్ ఉన్నారు.

జాతీయ స్థాయిలో అల్ఫోర్స్ విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న అల్ఫోర్స్ చైర్మన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ రూరల్, జనవరి 31: అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాల విద్యార్థి శ్రేయాస్‌రెడ్డి సిబిఎస్‌ఈ ఆధ్వర్యంలో ఆర్యభట్ట గణిత ఛాలెంజ్‌లో జాతీయ స్థాయిలో ర్యాంకు సాధించాడు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థిని అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి అభినందించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మేథ ఛాంపియన్ షిప్ సాధించిన అల్ఫోర్స్ డిగ్రీ విద్యార్థులు

కరీంనగర్ రూరల్, జనవరి 31: ట్రినిటి కాలేజి ఆఫ్ మేనేజ్‌మెంట్ నిర్వహించిన నేషనల్ లెవల్ మేనేజ్‌మెంట్ మీట్ మేథ 2024 ఛాంపియన్ షిప్‌ను అల్ఫోర్స్ మహిళా డిగ్రీ కళాశాల కైవసం చేసుకుంది. కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అల్ఫోర్స్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ వి రవీందర్‌రెడ్డి విద్యార్థినులను అభినందించారు. జనవరి 25 నుండి 29 వరకు జరిగిన మేనేజ్‌మెంట్ మీట్‌లో పికాసో, అవిష్కార్, ప్రయోజ్య, బిజినెస్ క్విజ్ తదితర 14 అంశాల్లో ప్రతిభచాటి ఓవరాల్ ఛాంపియన్ షిప్ సాధించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోలి శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి విజయలక్ష్మి, చంద్రశేఖర్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉచిత ఐవీఎఫ్ క్యాంపు

- డాక్టర్ బంగారి రజనీ ప్రియదర్శిని

సుభాష్‌నగర్, జనవరి 31: జిల్లా కేంద్రంలోని రెనే ఆసుపత్రిలోగల రజనీ ఫెర్టిలిటీ సెంటర్, శ్రీలక్ష్మీమహేశ్వర చారిటబుల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1 నుంచి మార్చి 8 వరకు ఉచిత ఐవీఎఫ్ క్యాంపును నిర్వహిస్తున్నట్లు రజనీ ఫెర్టిలిటీ సెంటర్ చైర్మన్ డాక్టర్ రజనీ ప్రియదర్శిని తెలిపారు. బుధవారం రెనే ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ఉచిత ఐవీఎఫ్ శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు. 10 జంటలను లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేసి ఐవీఎఫ్ వైద్యం ఉచితంగా అందిస్తామని తెలిపారు. డాక్టర్ బంగారి స్వామి మాట్లాడుతూ తమ అమ్మానాన్నల పేరుతో ప్రతి సంవత్సరం రెండు లక్షలకు పైగా ఖర్చు అయ్యే మోకీలు మార్పిడి ఆపరేషను పది మందికి ఉచితంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర ఐఎంఏ మాజీ అధ్యక్షుడు డాక్టర్ బీఎస్‌రావు, కరీంనగర్ ఐఎంఏ డాక్టర్ రాంకిరణ్, టీఎస్ఎంసీ సభ్యుడు డాక్టర్ బండారి రాజ్‌కుమార్, డాక్టర్ అలీం, డాక్టర్ ఝాన్సీలక్ష్మి, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ శేషశైలజ, డాక్టర్ కొల్లూరి రాధ, శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ సరసిజ, ప్రముఖ అడ్వకేట్ అంబల్ల మాధవి, రిటైర్డ్ ప్రిన్సిపాల్ బుర్ర మధుసూదన్‌రెడ్డి, ఆసుపత్రి సూపర్‌వైజర్ అరవింద్‌రావు పాల్గొన్నారు.

ఈవెంట్ ఆర్గనైజర్స్ అసోసియేషన్‌కు అండగా నిలుస్తా

కరీంనగర్ కల్చరల్, జనవరి 31: ఈవెంట్ ఆర్గనైజర్స్ అసోసియేషన్‌కు అండగా నిలుస్తానని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. బుధవారం వైశ్యభవన్‌లో జరిగిన అసోసియేషన్ ఆవిర్భావ, కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వ్యవస్థాపక అధ్యక్షులుగా గోగుల ప్రసాద్, ప్రవీణ్ సల్వాజి, అధ్యక్ష కార్యదర్శులుగా గౌరవేని బాబు, గంధం నరేశ్‌బాబు. ఉపాధ్యక్షులుగా అభినవ్ కొత్తకొండ, తిప్పబత్తిని రవి, కోశాధికారిగా తమ్మిశెట్టి సంతోష్, ప్రోగ్రాం కన్వీనర్‌గా చిలువేరి శ్రీకాంత్, సహాయ, సంయుక్త కార్యదర్శులుగా మిరాయాల ఆనంద్, జెపి, ప్రచార కార్యదర్శిగా తుమ్మల మధు, పట్టణ కార్యదర్శిగా మిమిక్రి మహేశ్, యాక్షన్ కమిటీ సభ్యులుగా రేణికుంట అజయ్, శ్రీను, సాయికంఠ, మధు, గౌరవ సలహాదారులుగా సిద్ధి రమేశ్, యతిరాజు, నవీన్, సభ్యులుగా సునీత, శోభ, సాయిదీక్షిత్‌లతో ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేయించారు. ఎమ్మెల్యేను అసోసియేషన్ బాధ్యులు సన్మానించారు.

కోనోకార్పస్ మొక్కలను తొలగించాలి

హుజూరాబాద్, జనవరి 31: హుజూరాబాద్ పట్టణంలోని జమ్మికుంట రోడ్‌లో డివైడర్ మధ్యలో పెట్టిన కోనోకార్పస్ మొక్కలను తొలగించాలని కోరుతూ పర్యావరణ పరిరక్షణ కమిటీ సభ్యులు బుధవారం మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోనోకార్పస్ పుష్పాల నుంచి వెలువడే పుప్పొడి వల్ల ఎలర్జీ, శ్వాసకోశ, అస్తమా సమస్యలు వస్తున్నాయని వి ప్రభాకర్, రవీందర్, రాజిరెడ్డి, స్వామి అన్నారు. జమ్మికుంట రోడ్‌కు ఈ మొక్కలు ఉండడం వల్ల చాలా మంది అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. వెంటనే వాటిని తొలగించాలని కోరారు.

నూతన గ్రామ పంచాయతీ భవనం ప్రారంభం



పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

వీణవంక జనవరి31: మండలంలోని దేశాయిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ప్రారంభించారు. దాదాపు రూ.20 లక్షల నిధులతో భవనాన్ని నిర్మించినట్టు సర్పంచ్ గాలేటి జ్యోతి సురేందర్, ఎంపీపీ ముసీపట్ల రేణుక తిరుపతిరెడ్డి తెలిపారు. అనంతరం గ్రామ పంచాయతీ పాలక వర్గాన్ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమములో జడ్పీ చైర్ పర్సన్ కనుమల్ల విజయ,ఎంపీపీ ముసీపట్ల రేణుక తిరుపతి రెడ్డి, సర్పంచ్ గాలేటి జ్యోతి సురేందర్ రెడ్డి, జడ్పీటీసీ మాడ వనమాల సాధవరెడ్డి,ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో ప్రబాకర్, ఎఈ రాంబాబు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

హుజూరాబాద్‌రూరల్, జనవరి 31: విద్యార్థులు ఉద్యోగ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని టాస్క్ రిలేషన్ మేనేజర్, కోఆర్డినేటర్ గంగాప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని సింగాపూర్ బీఎస్‌ఆర్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ వివిఎన్ హనుమకుమార్ అధ్యక్షతన 'నైపుణ్యాలు ప్రాంగణ నియామకాలు' అనే అంశంపై వర్క్‌షాప్ జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులను ద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉద్యోగ సాధన కోసం సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్ ప్రవీణ్ మాధురి, టాస్క్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ తాళ్లపల్లి అజయ్ ఉన్నారు.

మాజీ సీఎం కేసీఆర్ కుట్రలను సాగనివ్వం

● టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముక్కెర రాజు

హుజూరాబాద్, జనవరి 31: తెలంగాణ ఉద్యమ రథసారథి ప్రొఫెసర్ కోదండరామ్ శాసనమండలి ఎన్నికను అడ్డుకుంటున్న మాజీ సీఎం కేసీఆర్ కుట్రలను సాగనివ్వమని టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముక్కెర రాజు అన్నారు. బుధవారం హుజూరాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కోదండ రామ్ చట్టసభకు ఎన్నిక కాకుండా అడ్డుకోవడం సిగ్గు చేటన్నారు. ఉద్యమ కారులపై కేసీఆర్ చేస్తున్న కుట్రలను, నిర్బంధాలను ప్రజాస్వామిక వాదులు, ఉద్యమకారులు వ్యతిరేకించాలన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే గ్రామ పంచాయతీల అభివృద్ధి

హుజూరాబాద్‌రూరల్, జనవరి31: బీఆర్ఎస్ హయాంలోనే గ్రామపంచాయతీల అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని రాజాపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని సర్పంచ్ చింత సరితతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ హయంలో పల్లెలు అన్ని రంగాల్లో పరుగులు పెట్టి అవార్డులు సాధించిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు.అనంతరం సర్పంచ్ పదవీకాలం చివరి రోజు కావడంతో సర్పంచ్‌ను శాలువాతో సత్కారించారు.ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్ పర్సన్ కనుమల్ల విజయ, నాయకులు ఉన్నారు.

ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

కరీంనగర్ రూరల్, జనవరి 31: అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా పనిచేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. ప్రజలకు సేవ చేయడమే రాజకీయ నాయకుల కర్తవ్యమని ఆయన అన్నారు. బుధవారం కరీంనగర్ రూరల్ మండల సర్వ సభ్య సమావేశంలో పదవీ కాలం పూర్తయిన సర్పంచులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. ప్రజలకు సేవ చేసే అదృష్టాన్ని మనకు కల్పించారని, ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనులు చేయాలన్నారు. ప్రత్యేకాధికారుల పాలనలో పదవీ కాలం పూర్తయిన సర్పంచులు ప్రత్యేకాధి కారులకు సహకరించాలన్నారు. రైతులకు అండగా ఉండాలని, అదే లక్ష్యంతో అధికారులు, ప్రభుత్వం పని చేయాలన్నారు. పదేళ్లలో తెలంగాణను సాగులో అగ్రభాగాన నిలిపామన్నారు. అధికారులు పెండింగ్ పనులన్నీ పూర్తి చేయాలన్నారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధి కారులపై ఉందన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య, జడ్పీటీసీ పురమల్ల లలిత శ్రీనివాస్, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, తహసీల్దార్ నవీన్, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో ప్యారడైజ్ విద్యార్థుల ప్రతిభ

కరీంనగర్ రూరల్, జనవరి 31: రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో ప్యారడైజ్ విద్యార్థులు ఉత్తమ ప్రదర్శన కనబరిచి పతకాలు సాధించారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్యారడైజ్ పాఠశాల చైర్మన్ డాక్టర్ పి పాతిమారెడ్డి విద్యార్థులను అభినందించారు. డ్రాగన్‌స్వార్డ్ కుంగ్‌ఫూ అకాడమి ఆధ్వర్యంలో మూడవ రాష్ట్రస్థాయి కరాటే ఛాంపియన్ షిప్ పోటీల్లో వందితారెడ్డి, సమీక్ష, హరిణి, విందుశ్రీ, అనన్య, పావని, శశివర్ధన్, రాజరణదీర్, ఎండి అహ్మద్‌లు బంగారు పతకాలు సాధించారు. ఈకార్యక్రమంలో అకడమిక్ సీఈఓ ఉమాకాంత్, ప్రిన్సిపాల్ టి వసంత పాల్గొన్నారు.

యూనిటీ కప్ క్రికెట్ విజేత కరీంనగర్

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 31: కరీంనగర్ క్రికెట్ క్లబ్, సూఫా క్రికెట్ అకాడమి ఆధ్వర్యంలో 15 రోజులుగా కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన యూనిటీ కప్ క్రికెట్ లీగ్ సీజన్-1 క్రికెట్ పోటీలు బుధవారం ముగిసాయి. యూనిటీ కప్ సీజన్-1 చాంపియన్‌గా కరీంనగర్ క్రికెట్ క్లబ్ నిలువగా రన్నరప్‌గా ఆసం ఎలెవెన్ కరీంనగర్ జట్టు నిలిచింది. రాత్రి జరిగిన బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కరీంనగర్ రూరల్ ఏసీపీ కరుణాకర్‌రావు హాజరై విజేతలకు ట్రోఫీలను, చెక్కులు, మెడల్స్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో కరీంనగర్ 1వ టౌన్ సిఐ సరిలాల్, కరీంనగర్ క్రికెట్ క్లబ్ ప్రధాన కార్యదర్శి పులమల్ల యాదగిరి, సుఫా క్రికెట్ అకాడమి బాధ్యులు సురేష్, సుల్తాబాద్ క్రికెట్ క్లబ్ కార్యదర్శి మహేందర్ పాల్గొన్నారు.

'పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పాలి'

సుభాష్‌నగర్, జనవరి 31: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పాలని ప్రజామిత్ర ప్రొగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ అన్నారు. బుధవారం నగరంలోని తన కార్యాలయంలో చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఈ మధ్యకాలంలో మాట్లాడే మాటలు ఆయన మానసిక స్థితి దెబ్బతిన్నట్లు ఉన్నాయన్నారు. సమావేశంలో బోయినిపల్లి చంద్రయ్య, చిగిరి శ్రీధర్, తరాల్ల నరసయ్య, సిహెచ్ రామూర్తి, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఎంపీ మార్కెట్ నిర్మాణం చేపట్టి మాట నిలబెట్టుకోవాలి'

కరీంనగర్ టౌన్, జనవరి 31: నగరంలోని ప్రధాన కూరగాయల మార్కెట్ నిర్మాణం చేపట్టి మాటనిలబెట్టుకోవాలని సివిల్ సప్లయి కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సర్దార్ రవీందర్‌సింగ్ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌ను డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్‌ను కానీ, కేసీఆర్, కేటీఆర్ కుటుంబాన్ని కాని విమర్శిస్తే ఊరుకోబోమని రవీందర్‌సింగ్ బీజేపీ, కాంగ్రెస్ నాయకులను హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, కెమసారం తిరుపతి, పెండ్యాల మహేశ్, తులా బాస్కర్ రావు, మటన్ మార్కెట్ అధ్యక్షుడు అల్తాఫ్, కూరగాయల మార్కెట్ ప్రతినిధులు లంక రవీందర్, వెంకన్న రజనీకాంత్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ సంజయ్‌పై ఆరోపణలు చేస్తే పరువునష్టం దావా వేస్తాం

-మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ళపు రమేశ్

కరీంనగర్ టౌన్, జనవరి 31: కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్‌పై అసత్యపు ఆరోపణలను చేస్తే పరువునష్టం దావా వేస్తామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ళపు రమేశ్ బీఆర్ఎస్ నాయకులను హెచ్చరించారు. బండి సంజయ్‌పై చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ చేసిన వాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయనకు ప్రజలు కర్రు కాల్చి వాతపెట్టినా కూడా ఆయనలో ఇంకా మార్పురాలేదని ఎద్దేవా చేశారు. ఐదేళ్ళు ఎమ్మెల్యేగా అవినీతిసామ్రాట్‌గా మారారని, చొప్పదండి నియోజకవర్గాన్ని నిర్లక్ష్యం చేయడంతోనే ప్రజలు తిరస్కరిస్తే కరీంనగర్‌లో తమ నాయకుడిపై అవాకులు చవాకులు పేల్చుతున్నాడని మండిపడ్డారు. బీసీ బిడ్డ బండి సంజయ్‌కుమార్ అంచెలంచెలుగా ఎదిగారని, కేసీఆర్ కుటుంబ రాచరికపు మోసపూరిత పాలనపై పోరాటం చేసి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్ళడంతో సక్సెస్ అయ్యారని అన్నారు. అధికారంలో కోల్పోవడంతో తట్టుకోలేక బీఆర్ఎస్ నాయకులు ప్రధాని మోదీ పాలనను చూసి ఓర్వలేక ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని, ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలని రమేశ్ హెచ్చరించారు.

నేటి నుంచి ఆర్థోపెడీషియన్స్ రాష్ట్ర సదస్సు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్థోపెడిక్ అసోసియేషన్ బాధ్యులు

సుభాష్‌నగర్, జనవరి 31: కరీంనగర్ ఆర్థోపెడిక్ సర్జన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 1 నుంచి 4వ తేదీ వరకు రాష్ట్ర ఆర్థోపెడిక్ డాక్టర్ల 9వ రాష్ట్ర సదస్సును నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు, సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ బంగారి స్వామి, ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ మోతిలాల్ తెలిపారు. బుధవారం నగరంలోని రెనే ఆసుపత్రిలో విలేకరుల సమావేశంలో వారు సదస్సు వివరాలను తెలియచేశారు. సదస్సులో లైవ్ సర్జరీలను చూపిస్తు, సర్జరీలలో వస్తున్న అధునాతన వైద్య విధానాలను తెలియచేస్తారని తెలిపారు. రెనే, చల్మెడ, ప్రతిమ వైద్య కళాశాలలో లైవ్ సర్జరీలు నిర్వహిస్తారన్నారు.

ఈ సదస్సుకు మంత్రులు, పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. అలాగే చివరిరోజు నిర్వహించే రాష్ట్ర కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవానికి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో కో చైర్మన్ డాక్టర్ నర్సింహులు, కార్యదర్శి డాక్టర్ వంశీధర్‌రెడ్డి, కోశాధికారి డాక్టర్ వేముల చంద్రశేఖర్, సైంటిఫిక్ కమిటి చైర్మన్ డాక్టర్ వెంకటరెడ్డి, కో చైర్మన్ డాక్టర్ పవన్‌శర్మ, డాక్టర్ వి రాంరెడ్డి, డాక్టర్ శివ కుమార్, డాక్టర్ చొక్కారపు రాము, డాక్టర్ శంశీచాట్ల, డాక్టర్ వేణు, డాక్టర్ కృష్ణ కుంకుమల్ల, డాక్టర్ అభిలాష్, డాక్టర్ కీర్తన తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశం

కరీంనగర్ రూరల్, జనవరి 31: కొత్తపల్లి మున్సిపాలిటీ సాధారణ సమావేశం బుధవారం మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు అధ్యక్షతన జరిగింది. సాధారణ సమావేశంలో 36 అంశాలు ప్రస్తావించగా రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని దోమలనివారణ కోసం ఫాగింగ్, పలు వార్డుల్లో విద్యుత్ స్తంభాలను అత్యవసరంగా పోల్స్ వేసి స్ట్రీట్ లైట్స్ బిగించాలన్నారు. ఈ సమావేశంలో కమిషనర్ వేణు మాధవ్, కౌన్సిలర్లు వాసాలరమేష్, జేరిపోతుల మొండయ్య, జేరిపోతుల అంజలి, మానుపాటి వేణుగోపాల్, గున్నాల విజయ, ఎస్‌కె నాజియా, స్వర్గం వజ్రదేవి, గండు రాంబాబు, చింతల సత్యనారాయణరెడ్డి, కవిత, కో-ఆప్షన్‌సభ్యులు కట్లమమత, ఎండి ఫకృద్దీన్, షెట్టిపల్లి ప్రభాకర్, ఎస్‌కె షహనాజ్ పాల్గొన్నారు.

నియోజకవర్గంలోని ప్రతి పల్లె అభివృద్ధికి కృషి

● ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



కొండన్నపల్లిలో అంగన్‌వాడీ భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర, జనవరి 31: పల్లెల అభివృద్దే ప్రభుత్వ లక్ష్యమని నియోజకవర్గంలోని ప్రతి పల్లెను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. బుధవారం ఆయన మండలంలోని కొండన్నపల్లిలో 5లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనం, హైమాస్ట్ లైట్లు, రజక సంఘ భవనానికి భూమి పూజ, బూరుగుపల్లిలో 20లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనం, 18లక్షలతో నిర్మించిన ఆధునిక వైకుంఠధామంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి గ్రామం అభివృద్దే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. బూరుగుపల్లివైకుంఠ దామ స్ట్రెక్చర్‌ను ఏర్పాటు చేసిన నేరెళ్ల రాజేశంగౌడ్‌ను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పుల్కం అనురాధ నర్సయ్య, సర్పంచ్‌లు రేండ్ల జమునశ్రీనివాస్, సాగిరమ్యమహిపాల్‌రావు, ఎంపీటీసీ దూళం లక్ష్మి శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ బోర్డులో అక్రమ కట్టడం కూల్చివేత

జమ్మికుంట రూరల్, జనవరి 31: జమ్మికుంట పట్టణ పరిధిలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో తుడి రవిచందర్ అనే వ్యక్తి ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి ప్రహరీ నిర్మించాడని లింగంపల్లి శ్రీనివాస్ మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు విచారణ చేపట్టి బుధవారం ప్రహరీ కూల్చి వేశారు.

క్రీడాకారిణికి అభినందన

తిమ్మాపూర్, జనవరి31: మండలంలోని పోరండ్లకు చెందిన పార్లంది శ్రీనిధి కరాటేలో జాతీయ, అంతర్ జాతీయ స్థాయిలో రాణిస్తుండగా బుధవారం తిమ్మాపూర్ సిఐ కార్రే స్వామి, ఎల్‌ఎండి ఎస్సై చేరాలు అభినందించారు. మరెన్నో పథకాలను సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు.

ఎమ్మెల్సీ బల్మూరిని కలిసిన నాయకులు

హుజూరాబాద్, జనవరి 31: నూతనంగా ఎమ్మెల్సీగా ఎన్నికైన బల్మూరి వెంకట్‌ను హైద్రాబాద్‌లో బుధవారం హుజూరాబాద్ కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సొల్లు బాబు, ఎండీ అఫ్సర్ పాల్గొన్నారు.

మాదాపూర్ పంచాయతీ భవనం ప్రారంభం



గ్రామపంచాయతీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

గన్నేరువరం, జనవరి 31, మండలంలోని మాదాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి మౌళిక వసతుల కల్పనకు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుమ్మరి సంపత్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, నాయకులు కొమ్మెర రవిందర్‌రెడ్డి, మార్గం మల్లేశం, కల్లెం మల్లారెడ్డి, సంపతి ఉదయ్, వార్డుసభ్యులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ పాలకవర్గాలకు ఘనంగా వీడ్కోలు

తిమ్మాపూర్, జనవరి31: పదవీకాలం ముగియడంతో ఇందిరానగర్ గ్రామ పంచాయతీ పాలకవరాన్ని ఎంపిటిసి కొత్త తిరుపతిరెడ్డి, సర్పంచ్, వార్డు సభ్యులను, గ్రామ సిబ్బందిని శాలువాలతో సత్కరించి స్వీట్లు తినిపించి ఘనంగా సన్మానించారు. పాలకవర్గ సభ్యులు కూడా తమకు సహకారించిన గ్రామ ప్రజలకు ధాన్యవాదలు తెలియజేశారు.

గన్నేరువరం: సర్పంచుల పదవీకాలం ముగియడంతో మండలంలోని మైలారం గ్రామంలో సర్పంచ్ దుడ్డు రేణుకమల్లేశం, ఉపసర్పంచ్ కరిష్మాజానీ, వారుసభ్యులను గ్రామస్థులు బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు ముత్యాల జగన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మైసంపల్లి తిరుపతి, పంచాయితి కార్యదర్శి, జీపి కార్మికులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ హయాంలో లక్షా 61వేల ఉద్యోగాలు కల్పించాం'



మానకొండూర్‌లో సర్పంచులను సన్మానిస్తున్న వినోద్‌కుమార్

మానకొండూర్, జనవరి 31: బీఆర్ఎస్ హయాంలో నిరుద్యోగులకు లక్షా 61వేల ఉద్యోగాలు కల్పించామని మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్‌కుమార్ అన్నారు. మానకొండూర్‌లోని మీనాక్షీ ఫంక్షన్‌హల్‌లో మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులకు ఆత్మీయ వీడ్కోలు సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ గ్రామాలలో ఐదేళ్లుగా సర్పంచి పదవిలో కొనసాగి గ్రామాలభివృద్దే ధ్యేయంగా పని చేశారన్నారు. రాజకీయాలలో సర్పంచు పదవి తొలిమెట్టని సర్పంచుగా చేసిన వారందరూ ముఖ్యమంత్రి అయ్యారని తెలిపారు. మండలంలోని సర్పంచులకు పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమయంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జీవి రామకృష్ణారావు, జడ్పీటీసీ తాల్లపల్లి శేఖర్‌గౌడ్, గ్రామసర్పంచు రొడ్డ పృథ్వీరాజ్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

11న 'ఆట' ప్రతినిధుల సమావేశం

కరీంనగర్ కల్చరల్, జనవరి 31: ఈనెల 11న భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి కూడలిలో ఉన్న తెలంగాణ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ భవనంలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆట (అవార్డీ టీచర్స్ అసోసియేషన్) ప్రతినిధుల శిఖరాగ్ర సమావేశం జరుగ నున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో కార్యవర్గ ఎన్నికలు నిర్వహించి ప్రమాణస్వీకారం చేస్తారని పేర్కొన్నారు. వ్యవస్థాపక అధ్యక్షుడు బెక్కంటి శ్రీనివాసరావు అధ్యక్షతన ఆట నిర్వహించే కార్యక్రమాలపై, భవిష్యత్ కార్యాచరణపై చర్చ ఉంటుందని తెలిపారు. ఆట గత 15 సంవత్సరాలుగా బెక్కంటి శ్రీనివాస్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వ ర్యంలో వివిధ విభాగాల్లో జాతీయ, అంతర్జాతీయ వేదికలు ఏర్పాటు చేస్తున్న తరుణంలో జిల్లా, రాష్ట్ర, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారగ్రహీతలతో పాటు సామాజిక సేవకులు, కళాకారులు, కవులు సమావేశానికి హాజరు కావాలని కోరారు. ఇతర వివరాల కోసం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వి రంగాచార్యులు, 8331843262 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఇంటి వద్దనే రిజిస్ట్రేషన్

కరీంనగర్ రూరల్, జనవరి 31: కరీంనగర్ రూరల్ మండలం నగునూరు గ్రామానికి చెందిన పట్టాదారుడు దామరపల్లి శ్రీనివాస్ కదలలేని స్థితిలో ఉండగా ఆయన ఇంటి వద్దనే తహసీల్దార్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తిచేశాడు. నగునూరు శివారులో పట్టాదారుడు దామ రపల్లి శ్రీనివాస్ ధరణి యందు తన కొడుకులకు గిఫ్ట్ రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. తాను పక్షవాతంతో కదలలేని స్థితిలో ఉండగా తహసీల్దార్ నవీన్ వారి ఇంటి వద్దకే వెళ్లి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసి పత్రాలను అందజేశారు.

సీసీ కెమెరాల బహూకరణ

కరీంనగర్ రూరల్, జనవరి 31: కరీంనగర్‌రూరల్ మండలం బొమ్మకల్ గ్రామానికి చెందిన గసికంటి అజయ్(చిన్న) వైషు విషన్ సెక్యూరిటీస్ ద్వారా ఐదు సోలార్ సిసి కెమెరాలను బహూకరించారు. కరీంనగర్ రూరల్ ఏసీపీ కరుణాకర్‌రావు చేతుల మీదుగా సర్పంచ్ పురమల్ల శ్రీనివాస్‌కు అందజేశారు.

గ్రామ పంచాయతీ భవనం ప్రారంభం

కరీంనగర్‌రూరల్, జనవరి 31: కరీంనగర్‌రూరల్ మండలంలోని మందులపల్లి గ్రామపంచాయతీ భవనాన్ని జెడ్పిటిసి పురమల్ల లలితశ్రీనివాస్, సర్పంచ్ యర్వ రాజమల్లులు ప్రారంభించారు. ఈకార్యక్రమంలో కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్, ఉపసర్పంచ్,వార్డు సభ్యులు తదితరులుపాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరణ

భగత్‌నగర్, జనవరి 31: నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఆల్ ట్రేడ్ యూనియన్స్ ఐఎన్‌టియుసి, ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టియు, బిఆర్‌టియు జిల్లా నాయకుల రౌండ్ టేబుల్ సమావేశంలో కరపత్రాన్ని విడుదల చేశారు. ఈసదర్భంగా నాయకులు మాట్లాడుతూ ఫిబ్రవరి 16వ తేదీన దేశ వ్యాప్త సమ్మె విజయవంతానికి పలు అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 6వ తేదీన బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో జరిగే ఆల్ ట్రేడ్ యూనియన్స్ జిల్లా సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కాంగ్రెస్‌పార్టీ కార్మిక విభాగంనేత కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, ఏఐటియుసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బుచ్చన్న యాదవ్, టేకుమల్ల సమ్మయ్య సిఐటియు జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్, జిల్లా సహాయ కార్యదర్శి పున్నం రవి, బిఆర్‌టియు జిల్లా అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి జిందం ప్రసాద్, కాంగ్రెస్ బిసిసెల్ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ పాల్గొన్నారు.

'కోదండరాం ప్రమాణ స్వీకారాన్ని అడ్డుకోవడం సరికాదు'

కరీంనగర్ టౌన్, జనవరి 31: తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ప్రొఫెసర్ కోదండరాం ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేయడాన్ని అడ్డుకోవడం ప్రజాస్వామ్యంలో చీకటి రోజుగా భావిస్తున్నామని, ఇది సరికాదని తెలంగాణ జన సమితి యువజన జిల్లా అధ్యక్షుడు కర్రె సతీష్ యాదవ్, రాష్ట్ర కార్యదర్శి మోరె గణేశ్, సంజీవ్‌కుమార్, ప్రవీణ్, శ్రీను ఒక సంయుక్త ప్రకటనలో ఖండించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కేసీఆర్ కుటుంబానికి రాజకీయ సమాధి తప్పదని హెచ్చరించారు.

జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ

చొప్పదండి, జనవరి 31: జాతీయ చిత్రలేఖన పోటీల్లో చొప్పదండి బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి పతకాలను సాధించారు. పోటీలలో 97 మంది విద్యార్థులు పాల్గొనగా 10 మంది బంగారు పతకాలు, 9 మంది రజత పతకాలను సాధించారు. కాగా పతకాలను సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జంగం శ్రీనివాస్, డ్రాయింగ్ మాస్టర్ చేపూరి గోపి, ఉపాధ్యాయులు ర్యాకం మహేశ్, ఎం శ్రీనివాస్, బి పల్లవి, వై తిరుపతి, పి శ్రీధర్, ము కుందరెడ్డి, బబిత, క్రాంతి, వంగపెల్లి సూర్యప్రకాశ్, రేణు కలు విఐద్యార్థులను అభినందించారు.

ఎమ్మెల్సీ మహేష్‌గౌడ్‌ను కలిసిన రమేష్

హుజూరాబాద్, జనవరి 31: హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బోర్నపల్లి గ్రామానికి చెందిన టీపీసీసీ ఎస్సీ సెల్ మాజీ జాయింట్ కన్వీనర్ దొంత రమేష్ బుధవారం హైద్రాబాద్‌లోని గాంధీభవన్‌లో ఎమ్మెల్సీ మహేష్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

శివాలయంలో అన్నదానం

జమ్మికుంట రూరల్, జనవరి 31: బల్మూరి వెంకట్ ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ పట్టణంలోని శివాలయం (బొమ్మల గుడి)లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఎరబెల్లి రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో బుధవారం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అదేవిధంగా మండలంలోని బిజి గిరిషరీఫ్ దర్గాలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రత్యేక పూజ =లు చేసి, 101కొబ్బరి కాయలు కొట్టారు.

విశ్రాంత గ్రంథాలయ అధికారికి సంతాపం

తిమ్మాపూర్, జనవరి31: కేంద్రీయ విశ్వ విద్యాలయ విశ్రాంత గ్రంథాలయ అధికారి, మల్లాపూర్ గ్రామానికి చెందిన డాక్టర్ ఇనుకొండ రామ్‌రెడ్డి జనవరి30న మృతి చెందారని ఆయన మృతిపై తెలంగాణ గ్రంథాలయ వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ముదుగంటి సుధాకర్ సంతాపం తెలిపారు.

మండల స్థాయి పోటీలు

ఇల్లందకుంట, జనవరి 31: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఇంగ్లీష్ భాషోపాధ్యాయుల ఆధ్వర్యంలో మండల స్థాయి స్పెల్ విజార్డ్, డ్రామ పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు గంగిశెట్టి మధురమ్మ ట్రస్టు వ్యవస్థాపకుడు గంగిశెట్టి జగదీశ్వర్ ఆధ్వర్యంలో బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో విడపు శ్రీనివాస్ , హెచ్‌ఎం సాంబయ్య పాల్గొన్నారు.

సన్మానం

గంగాధర, జనవరి 31: పేదవారికి అండగా నిలవడం కొందరికే సాధ్యమవుతుందని వివేకానంద విద్యాలయం కరస్పాండెంట్ లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని ఇస్తారుపల్లికి చెందిన తల్లిదండ్రులను కోల్పోయిన శైలజ, అంజలిలను దత్తత తీసుకుని వారిని చదివిస్తూ, అవసరాలను తీర్చుతున్న కోటేశ్వర్ బాబు(యూఎస్ఏ)ను గంగాధర లయన్స్‌క్లబ్, వివేకానంద విద్యాలయం కరస్పాండెంట్ లక్ష్మారెడ్డిలు సన్మానించారు.